# తద్దినం



'ఈనాడు తెలుగునాడు' పక్ష పత్రిక . . . 1-15 సెప్టెంబర్, 1979

"ఏమండీ... ఎల్లుండే మామగారి తద్దినం! జ్ఞాపకముందిగా..?!"

- అంది శాంత... రామారావు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి సైకిల్ లోపల పెట్టుండగానే.

"అవును కదూ... మర్చేపోయాను!" అన్నాడు రామారావు సైకిల్ స్టాండ్ వేస్తూ.

"హుం... మర్చిపోయారు! అనుకుంటూనే ఉన్నాను. వారం క్రిందటే చెప్తే 'ఇంకా టైముందిగా...' అన్నారు. ఇప్పుడేమో 'మర్చేపోయాను...' అంటున్నారు. భలేవారండీ మీరు- తండ్రి తద్దినమే మర్చిపోయే ఘనులు మీరు!" అంది శాంత నిష్ఠూరంగా.

"నిజమే! ఏమిటో... పట్నాల్లో ఉద్యోగాలు చేస్తున్నాక ఇవేవీ జ్ఞాపకం ఉండడం లేదు!" అన్నాడు రామారావు చొక్కా విప్పుకుంటూ.

"శ్రద్ధ లేకపోవడం కానీ, జ్ఞాపకం ఉండకపోవడమేమిటి? మిగిలిన విషయాలు జ్ఞాపకం ఉండందలా?" అంది శాంత- భర్తకి లుంగీ అందిస్తూ.

"అయినా... కన్నకొడుకుని నాకు లేని జ్ఞాపకం నీకెలా ఉందబ్బా?" అన్నాడు రామారావు లుంగీ కట్టుకొంటూ, చిరునవ్వు నవ్వుతూ.

"పాపం... మీకేమో ముసలితనం ముంచుకొస్తోందాయె! అందువల్ల జ్ఞాపకశక్తి క్షీణిస్తోంది. నేనైతే మీకంటే చిన్నదాన్నే కదా... కాబట్టి నా జ్ఞాపకశక్తి పదునుగానే ఉంది!" అంది శాంత కొంటెగా.

"అబ్బో! జమ్ముకున్న టపాకాయలాగా ఏమి జోక్ పేల్చావు? అదేమీ కాదు- భార్యని 'కరణేషు మంత్రీ...' అన్నారు పెద్దలు. అంటే ఇటువంటి విషయాలన్నీ జ్ఞాపకం ఉంచుకోడం, భర్తకి జ్ఞాపకం చేయడం, తగు సలహాలు ఇవ్వడం- ఇవన్నీ నీ డ్యూటీ! అందుకనే జ్ఞాపకం ఉంచుకున్నావు, చెప్పావు. నీ డ్యూటీ కరెక్ట్‌గా చేస్తున్నావని ఒప్పుకుంటాను. కావలిస్తే సర్టిఫికెట్ కూడా ఇస్తాను!" అన్నాడు రామారావు ప్యాంట్‌ని హ్యాంగర్‌కి తగిలిస్తూ.

"ఈ సరసాలకేమి గానీ, ఎల్లుండికి ఏమి చేయదలచుకున్నారో చెప్పండి! ఏర్పాట్లన్నీ ఒకరోజు ముందు చేసుకోకపోతే కుదరదు. రేపటిలోగా మీరు బ్రాహ్మడిని మాట్లాడాలి. రేపు సాయంత్రానికల్లా కూరలూ, వస్తువులూ అన్నీ తేవాలి. ఎల్లుండి మీరు ఆఫీసుకి సెలవు పెట్టాలి..."

- అంటూ పెద్ద లిస్టు చదువుకుపోసాగింది శాంత.

'ఆగు...' అన్నట్లు చేయి పైకెత్తాడు రామారావు.

"బస్ బస్... అక్కడికి ఆపు- అసలు సమస్య అక్కడే ఉంది!" అన్నాడు రామారావు పడక్కుర్చీలో నడుం వాలుస్తూ.

"ఎందులో? ఆఫీసుకు సెలవు పెట్టడంలోనా?" అంది శాంత- ప్రక్కనున్న కుర్చీలో తానూ కూర్చుంటూ.

"ఆఫీసుకి సెలవు పెట్టడం కూడా కొంచెం కష్టమేననుకో... ఇన్‌స్పెక్షన్ జరుగుతోంది! అయినా తద్దినం అంటే చచ్చినట్టు ఇస్తారనుకో- కాకపోతే బ్రాహ్మడిని పట్టుకోడంతోనే ఉంది చిక్కంతా!"

"మీది మరీ విడ్డూరం! ఈ ఊళ్లో రెండేళ్లబట్టీ మనం తద్దినం పెడ్తూనే ఉన్నాం. ప్రతిసారీ బ్రాహ్మణుడు దొరకడంలా?"

"పాపం... ఈ నగరంలో బ్రాహ్మడిని పట్టుకోవడమంటే అంత సులువేం కాదు. ఏ ఆధారం మిగల్చకుండా పారిపోయిన దొంగల్నైనా పట్టవచ్చు కాని, తక్కువ వ్యవధిలో బ్రాహ్మడిని పట్టుకోవడమంటే మాటలు కాదు. మనకి ఇంతకుముందు వచ్చిన బ్రాహ్మణుడుని పాపం- ఆ సుబ్బారావు కుదిర్చాడు. ఏదో మనవైపు వాడు... అందుకని మనమంటే కాస్త అభిమానంగా ఉండేవాడు. ఈసారి ఆయనే 'హరీ...' అని, తాను తద్దినాలు పెట్టించుకోవలసిన చోటికి ప్రమోషన్ మీద వెళ్లిపోయాడు."

"అయ్యో పాపం... ఆ బ్రాహ్మడు చచ్చిపోయాడా? పోన్లెండి... ఏం చేస్తాం! అయినా మీరు నాలుగు చోట్లకి వెళ్లి విచారిస్తే ఎవరూ దొరకరా? పైగా... వాళ్ళకేదో సంఘం కూడా ఉందిటగా! అక్కడికి పోయి అడగండి!"

"ఆc... ఆc... ఉన్నాయి- వాళ్ళకీ సంఘాలున్నాయి. రైళ్లలో రిజర్వేషన్ లాగా వీళ్ళని కూడా చాలా ముందుగానే బుక్ చేసుకుని అడ్వాన్స్ ఇచ్చుకోవాలి. సీజన్‌ని బట్టి సమయానుకూలంగా రేట్లు కూడా పెరుగుతాయి. ఒక్కరోజు వ్యవధిలో బ్రాహ్మడిని చూసుకోవడమంటే- ముందు రిజర్వేషన్ లేకుండా చివరి నిమిషంలో బెర్త్ కోసం పడ్డంత బాధపడాలి. ఇంత అవస్థ పడ్డా దొరుకుతాడో, దొరకడో? దొరికినా మన అవసరం చూసి మరింత గుంజుతాడు."

"ఇన్ని తెలిసినవాళ్ళేనా ఇన్నాళ్లూ ఊరుకుంది?! ఎప్పటినుంచి మీకు నేను జ్ఞాపకం చేస్తున్నాను?"

"నిజమే! కాదనను. అదిసరే కాని, మన ఊళ్లో అన్నయ్య ఎలాగూ తద్దినం పెడ్తాడుగా... ఇక్కడ మనం పెట్టకపోతే ఏం చెప్పు?" అంటూ ఆగి -

"ఎవరు పెట్టినా స్వర్గంలో ఉన్న ఆయనకి ముట్టేదేగా?" అన్నాడు రామారావు.

"హవ్వ! ఏం మాటలండీ అవి? ఆయనకి మీరూ కొడుకే! ప్రతి కొడుక్కీ తద్దినం పెట్టవలసిన బాధ్యత ఉంది. అసలు అందరూ కొడుకులు కావాలని కోరుకునేది ఎందుకు? పున్నామ నరకం నుంచి తప్పిస్తారనేగా?"

"ఆపాపు! ఆయనకి మేము ఇద్దరు కొడుకులమై ఉండవచ్చు. కాని, తినేది ఆయన ఒక్కడే! అయినా మన పిచ్చి కాని, ఏనాడో చనిపోయిన ఆయన పరలోకంలో కూర్చుని మనం బ్రాహ్మడికీ, ఆవుకీ, కాకికీ పెట్టి, నిప్పులో వేసే తిండి తింటాడా? లోకం ఎంత మారుతున్నా మనం మాత్రం ఇంకా మారడం లేదు."

రామారావు మాటలు విని కొంచెంసేపు కొయ్యబారిపోయింది శాంత. తర్వాత తేరుకుని -

"ఏమిటిది? ఎప్పుడూ లేనిది ఈరోజు ఇవాళ ఇలా మాట్లాడుతున్నారు? ఈ కర్మకాండని పెట్టినవాళ్ళంతా తెలివితక్కువ వాళ్ళేనా? ఆ తెలివితక్కువ వాళ్ళు చెప్పిన వాటిని ఇన్నివేల సంవత్సరాల నుండీ తెలివి లేకుండానే మనవాళ్ళు అనుసరిస్తున్నారా?"

"ఆ కాలంలో, ఏ పరిస్థితుల్లో, ఏ ప్రయోజనాన్ని ఆశించి ఈ కర్మకాండని మనవాళ్ళు పెట్టారో నేను చెప్పలేను. అప్పట్లో అది అవసరంగా భావించబడివుంటే ఉండవచ్చు. అందులో మధ్యలో కలిసిన మూఢాచారాలెన్నో తెలీదు. ఏదిఏమైనా ఈ కాలంలో కూడా ఇంకా వీటిని పట్టుకు కూర్చోడంలో నాకు ఔచిత్యం ఏమీ కనిపించదు."

"హుఁ... అందుకే అన్నారు కలికాలమని! ఇంతకీ మీరు తద్దినం పెట్టే ఉద్దేశం ఉందా, లేదా?" అంది శాంత సీరియస్‌గా.

"ఉందనుకో..." అంటూ నీళ్లు నమిలాడు రామారావు- శాంత ముఖంలోని సీరియస్‌నెస్‌ని గ్రహించి.

"అన్నట్లు... నీకు దూరంజేరే రోజులేమో! తీరా ఇంత ప్రయత్నం చేస్తే, నువ్వు మూలకూర్చుంటే ఎలా?" అన్నాడు.

శాంత ముఖంలో తీవ్రత మంచు విచ్చుకున్నట్లు విడిపోయింది. నవ్వుతూ "భలేవారే మీరు! ఎంత నంగనాచిగా మాట్లాడుతున్నారండీ! నేను స్నానం చేసింది పదిరోజుల క్రితమేగా! మీరేగా బాయిలర్ అంటించి నీళ్లు కాచి ఇచ్చింది?! తద్దినం మానడం కోసం నన్ను మళ్లీ దూరం కూర్చోమంటారా?" అంది.

'అంత అదృష్టమా..?' అని మనసులో అనుకుని,

"చూడూ... అసలే చలికాలం! నాకు చన్నీళ్ల స్నానం పడదని నీకు తెలుసుగా! క్రిందటిసారి చన్నీళ్ల స్నానం చేసి ఎంత బాధపడ్డానో నీకు జ్ఞాపకం ఉందిగా! మొన్నీమధ్యనేగా నేను మళ్లీ ఫ్లూ బారిన పడింది? మళ్లీ ఇప్పుడు చన్నీళ్ల స్నానం చేశానంటే ఫ్లూ తిరగపెడ్తుంది కూడాను. ఎందుకు చెప్పు ఈ ప్రయాస?" అన్నాడు పైకి.

"మీకా భయం అఖ్ఖర్లేదు. వేడివేడి నీళ్లు కాచిపెడ్తాను. మీ స్నానం అయ్యాక మడిగా ఒక్క చెంబుడు చన్నీళ్లు మీ తలమీద పోస్తాను... అది చాలు! అయినా ఏడాదికి ఒక్కసారి పెట్టేదానికి- చిన్నపిల్లాడి లాగా ఆ మారాం చేయడమేమిటి?" అంది శాంత నవ్వుతూ.

"ఆ ఒక్క చెంబుడూ చాలు- నా ప్రాణం తియ్యడానికి! 'కంఠాభరణం' నాటకంలో సెట్టి చన్నీళ్ల స్నానంచేసి కొయ్యబారిపోయినట్లు పోతాను... ఏమిటనుకుంటున్నావో! వేడివేడి నీళ్లు పోసుకున్న ఒంటిమీద మడినీళ్లు అయితే మాత్రం- చన్నీళ్లు పడితే ఇంకేమైనా ఉందా? నేను చెయ్యలేను బాబూ ఈ స్నానం! తల్చుకుంటే ఇప్పుడే నాకు వణుకు వస్తోంది!"

"మీతో వాదించే తీరికా, ఓపికా నాకు లేవు. అవతల నాకు వంటపని ఉంది. మీ నాన్నగారి మీద ఏమాత్రం గౌరవం ఉన్నా మారుమాట్లాడక సవ్యంగా తద్దినం పెట్టండి. ఆ తర్వాత మీ ఇష్టం. నేను చెప్పేది ఏమీ లేదు."

"అదికాదు శాంతా! నాన్నగారి మీద గౌరవం ఉంది కనుకనే తద్దినం పెట్టడం మానివేస్తే బాగుంటుందనుకుంటున్నాను. రెండేళ్ల నుంచీ పెడ్తూనే ఉన్నానా? మరి, ఇప్పుడు మానేయాలంటున్నానంటే... ఎందుకంటావ్?"

"ఏమో... నాకు తెలీదు."

"అన్నీ వ్యాపారసరళిలో నడుస్తున్నట్లే తద్దినాలు కూడా వ్యాపారమయ్యాయి. అయితే అయ్యాయి. ఫర్వాలేదు. కాని, సవ్యంగా జరిగితే అంతేచాలు! అసలు శ్రాద్ధమంటేనే శ్రద్ధతో పెట్టేది. ఈరోజుల్లో పెట్టేవాళ్ళకీ శ్రద్ధ లేదు, పెట్టించే పురోహితులకీ శ్రద్ధ లేదు. శ్రద్ధ మాట అటుంచు- కనీసం వారికి మంత్రాలైనా సరిగా రావే! మర్చిపోయిన చోట చావు మంత్రాలో, పెళ్ళి మంత్రాలో... అదేదీ కాకపోతే ఏ పూజామంత్రాలో చదివేస్తారు. మనకి సంస్కృతం రాదన్న ధీమాతో ఇష్టంవచ్చినట్లు ఆడుతారు. వీళ్ళా పురోహితులు?!" కాస్త అసహనంగా అన్నాడు రామారావు.

"మీరు సంస్కృత పండితులేగా?"

"పండితుణ్ణి కాదు కాని, చదువుకున్నందుకు సంస్కృతం అర్థంచేసుకోగలను. అదే నా బాధ! అర్థంచేసుకోగలను కాబట్టి వాళ్ళ తప్పులు తెలుసుకోగలుగుతున్నాను. అవి చూస్తూ ఊరుకుండలేకపోతున్నాను. తెలియకపోతే బాధే లేదు. వాళ్ళు చెప్పినవన్నీ వేదమనుకొని ఊరుకునేవాడిని. ఇటువంటి తంతుతో జరిగే ఈ తద్దినాలను చూస్తుంటే వాటిని పెట్టటం కంటే, ఒక దణ్ణంపెట్టి ఊరుకోడం మంచిదనిపిస్తోంది. చూస్తూ చూస్తూ ఈ అపసవ్య కర్మకాండని ఎలా సాగించమంటావు?"

"మీరు చెప్పింది నిజమే! కాదనను. కానీ, మనం చిత్తశుద్ధితో పెడుతున్నాం. అది మన బాధ్యత... దానిని మనం నెరవేరుస్తున్నాం! దానిని విస్మరిస్తే అది వాళ్ళ పొరపాటు. దానికి మనమేం చేస్తాం? కొడుకైయ్యుండీ తద్దినం పెట్టలేదనే మాట మనకెందుకు? మంచి పండితుడైన బ్రాహ్మణుడు దొరికితే సరే– లేకపోతే, ఉన్నదానితోనే తృప్తిపడదాం. అంతేకాని, తద్దినం మానవద్దు... అది శుభం కాదు."

"సరే... నాకోసం కాకపోయినా నీ తృప్తి కోసమైనా పెడ్తాను. అదిసరే... ఇంటికి వచ్చీరాగానే ఇంకా కాళ్లైనా కడుక్కోకముందే ఈ తద్దినం చర్చ మొదలెట్టావేమిటి?" అన్నాడు రామారావు.

"ఏమో... మర్చిపోతానేమోనని వెంటనే చెప్పాను. ఇంక ఒకరోజే కదా టైం ఉంది?!" అంది శాంత.

"ఏమిటీ... నువ్వు మర్చిపోవడమా? నాకంటే చిన్నదానివిగా!"

"అబ్బ... నామాట నాకే అప్పగిస్తున్నారు!" అంటూ నవ్వింది శాంత.

తానూ నవ్వుకుంటూ కాళ్లు కడుక్కోడానికి దొడ్లోకి వెళ్లాడు రామారావు.

●

మర్నాడు పొద్దున్నే వెళ్లి, ఎలాగైతేనేం... తద్దినం పెట్టించే బ్రాహ్మడిని కుదుర్చున్నాడు రామారావు.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి కొంచెం ముందుగానే బయలుదేరి కావలసిన సంబారాలన్నీ కొనుక్కుని వచ్చాడు.

ఆ మర్నాడు పొద్దున ఆకులు, వక్కలు, పళ్లు కొనుక్కురావడానికి బజారుకు వెళ్లాడు రామారావు. తిరిగివస్తుంటే దారిలో ఒక ఇరానీ హోటల్లో కూర్చుని సమోసాలు తింటూ, బీడీ కాలుస్తూ ఆ బ్రాహ్మడు కనిపించాడు. ప్రక్కనున్న మరో బ్రాహ్మడితో ఏదో మాట్లాడుతూ అవాచ్యాలు బ్రహ్మాండంగా, బహుధారాళంగా వదులుతున్నాడు.

రామారావుని చూసి కూడా చూడనట్లు తల ప్రక్కకి తిప్పుకున్నాడు. రామారావు తానూ చూడనట్లుగానే ముందుకి సాగిపోయాడు.

ఆ దృశ్యం చూసేసరికి రామారావుకి కడుపు తరుక్కుపోయింది. వాంతి వచ్చినంత పని అయింది. తద్దినం పెట్టించే బ్రాహ్మణుడంటే ఎంతో నిష్ఠగా ఉండాలి. అపరాహ్నం వరకూ ఏమీ తినకూడదు. అటువంటిది- ఈయన హాయిగా ఇరానీ హోటల్లో దర్జాగా సమోసాలు లాగించేస్తున్నాడు. పైగా... బీడీ ఒకటి! ఇవేవీ చాలనట్లు కారుకూతలు!! పవిత్రమైన మంత్రాలను ఉచ్చరించవలసిన నాలికతోనేనా ఈ బూతులు మాట్లాడుతోంది?! ఈయన బ్రాహ్మణుడు! ఇలాంటివాడు పెట్టించే తద్దినం మూలంగా పితృదేవతలకి ఉత్తమగతులు కలుగుతాయా?

కడుపు రగులుతున్నా చేసేదిలేక 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరుకోడం పొరపాటు!' అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.

తద్దినం ప్రారంభమైంది!

మధ్య మధ్య మంత్రాలను ఎగరకొట్టేయడం, మార్చేయడం మొదలుపెట్టాడు ఆ పురోహితుడు. వాటిని గుర్తుచేస్తే... తనదే రైటని దబాయించాలని చూశాడు మొదట్లో! ఆ తర్వాత రామారావుకి సంస్కృతం వచ్చని గ్రహించి, జోరు తగ్గించి పొరపాటయిందనో, పెద్దతనంతో జ్ఞాపకశక్తి క్షీణిస్తోందనో ఏవో సాకులు చెప్తూ... ఎలాగైతేనేం- తద్దినాన్ని అయిందనిపించాడు.

అంతా అయిన తర్వాత ఆశీర్వాదం కోసం ఆ బ్రాహ్మడి పాదాలకి నమస్కారం పెట్టడమంటే మనసొప్పలేదు రామారావుకి.

'ఈ భ్రష్టుడా... నన్ను ఆశీర్వదించేది? ఈ దౌర్భాగ్యుడి కాళ్లకా నేను మొక్కాల్సింది?!' అనిపించింది. ఏమైనా అదీ కర్మకాండలో భాగం కావడంవల్ల యాంత్రికంగా ఆయన పాదాలకి నమస్కరించాడు. 'అదీ... ఇదీ...' అంటూ డబ్బు బాగానే గుంజి, వెళ్లిపోయాడు ఆ బ్రాహ్మణుడు.

తద్దినం పూర్తయి భోజనాలు అయ్యేసరికి రెండుగంటలు దాటింది.

వాలుకుర్చీలో విశ్రాంతిగా నడుము వాల్చాడు రామారావు. తమలపాకులు తీసుకువచ్చి అతనికి ఇచ్చి, ప్రక్కనే కూర్చుంది శాంత.

"ఏమిటో... డబ్బయితే పోతోంది కాని, తృప్తి ఉండడం లేదు!" అంది.

"తద్దినం గురించేనా నువ్వు మాట్లాడుతోంది?!"

"అవునండీ... ఈ బ్రాహ్మడికి వయసుందే కాని కర్మకాండ తెలిసినట్టులేదు."

"ఈ బ్రాహ్మడే కాదు- ఈరోజుల్లో పెద్దపట్నాలలో ఉండేవాళ్ళు చాలామంది ఇటువంటి వాళ్ళే! ప్రొద్దున్నే చెప్తే నువ్వు బాధపడ్తావని చెప్పలేదు కాని, ఈ శ్రాష్టుడు ఏం చేశాడో తెలుసా?"

"ఏం చేశాడు..?"

"పొద్దున్నే ఇరానీ హోటల్లో చేరి శుభ్రంగా బొక్కేస్తున్నాడు. పైగా... బీడీ కాలుస్తూ బండబూతులు వాగుతున్నాడు."

"రామ రామ! తినివచ్చి తద్దినం పెట్టించడమేమిటండీ! వాళ్ళు తద్దినం అయ్యేదాకా భోజనం చేయకూడదనీ, పితృదేవతలు సూక్ష్మరూపంలో వారి శరీరంలో ప్రవేశించి భోజనం చేస్తారనీ అంటారు కదండీ?"

"ఆ మాట వాళ్ళకూ తెలుసు. కాని, దానిమీద వాళ్ళకే నమ్మకం లేదు. శ్రద్ధ, నమ్మకం లేకుండా పెట్టే శ్రాద్ధం ఫలిస్తుందంటావా? దానికి తగినట్లుగానే కాకి కూడా ముట్టుకోలేదు. అందుకే నేనో నిర్ణయానికి వచ్చాను."

"ఏమిటండీ అది?"

"ఇకముందు నేను నాన్నగారి తద్దినాలు పెట్టదలచుకోలేదు. అయితే ఎప్పుడూ చేసినట్లే వంటలు వండుదాం. ఆ పిండివంటల భోజనాన్ని మనకి తోచినట్లుగా ఒకళ్ళకో, ఇద్దరికో ఆకలితో అలమటించే వారికి కడుపునిండా పెడ్దాం! ఇంక తద్దినానికి అయ్యే ఖర్చుని ఏ పేదవాళ్ళకో, మంచిపనులు చేస్తున్న సంస్థలకో ఇద్దాం! నాన్నగారికి పేదసాదలకి సహాయం చేయడమంటే ఎంతో ఇష్టం... ఇటువంటి పనులు చేస్తే ఆయన ఆత్మ నిజంగా ఎంతో సంతోషిస్తుంది" అన్నాడు రామారావు ధృఢనిశ్చయంతో.

"మీ ఇష్టం! ఇవన్నీ చూస్తుంటే మీరు చెప్పిందే సరియైనదనిపిస్తోంది!" అంది శాంత.

'వారి నిర్ణయాన్ని రామారావు తండ్రి ప్రేతాత్మ ఆమోదించిందా...' అన్నట్లు- రివ్వున ఎగురుకుంటూ కాకి వచ్చి, ముందువైపు పెట్టిన పిండాన్ని కరుచుకుని ఎగిరిపోయింది.

'ఈనాడు తెలుగునాడు' పక్ష పత్రిక . . . *1-15* సెప్టెంబర్, *1979*